క్లుప్తంగా

ఇబ్బందులకు గురి చేయొద్దు

దుమ్ముగూడెం: ప్రభుత్వం పెన్షన్ దారులను ఇబ్బందులకు గురి చేయొద్దని బీఆర్ఎస్ మండల కన్వీనర్, కోకన్వీనర్ కణితి రాముడు, జానీపాషాలు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆసరా పెన్షన్‌దారుల అవస్థలపై ప్రభుత్వ విధానాన్ని తప్పు బట్టారు. పెన్షన్ దారులందరూ తమ ఆదాయ ధ్రువీకరణ పత్రలను ఇవ్వాలని, మళ్లీ కొత్త పెన్షన్ దారులవలె దరఖాస్తు చేసుకోవాలని ఆంక్షలు సరికాదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దామెర్ల శ్రీనివాసరవు,కాటే బోయిన వెంకటేశ్వర్లు, సోడే కొండయ్య, రాయపూడి పుష్పరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎంహెచ్ఓ



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: జిల్లా డీఎంహెచ్ఓ జయలక్ష్మి శనివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించగా.. శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకుంటున్న చర్యలు గురించి వివరించారు. గోదావరి వరదలు వస్తున్న వేల అప్రమత్తంగా ఉండాలని, సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్య తదితరులు ఉన్నారు.

బ్యాగులు, స్టేషనరీ పంపిణీ

కరకగూడెం: మండలంలోని బంగారుగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం 'ఆధార్ సంస్థ'డైరెక్టర్ తోలెం రమేష్ పలువురు చిన్నారులకు బ్యాగులు, స్టేషనరీని అందజేశారు. పేద పిల్లలకు విద్యా సహాయం అందించాలనే లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో కూడా పేదలను ఆదుకునే సేవా కార్యక్రమాలను మరింత ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి అండగా నిలబడటం తమ సంస్థ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధార్ వాలంటీర్లు, అంగన్‌వాడీ టీచర్ రవీంద్ర పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మాలమహానాడు పట్టణ కార్యదర్శిగా శాంతిరాజు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ మాలమహానాడు కార్యదర్శిగా దాసరి శాంతిరాజును నియామించిన్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పాల్ రాజ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మాల మహానాడు భద్రాచలం పట్టణ కమిటీ విస్తారణలో భాగంగా భద్రాచలంలో ఉత్సాహంగా యువకులకు బాధ్యలు అప్పగించి త్వరలో డివిజన్ మహాసభను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దాసరి శాంతి రాజు మాట్లాడుతూ.. ఈ పదవి ఇచ్చిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

తాపీమేస్త్రి కుటుంబానికి చేయూత

భద్రాచలంటౌన్: బూర్గంపహాడ్ మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన తాపీమేస్త్రి మృతిచెందడంతో.. పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబానికి భద్రాచలంలోని పరివర్తన యశోద ఫౌండేషన్ వారు దాతల సహకారంతో శనివారం 25 కేజీల బియ్యంతో పాటు రూ.3వేల నగదును అందజేశారు. అధ్యక్షులు కొమ్మగిరి వెంకటేశ్వర్లు, అప్పన్నదాస్ బాబు, కృష్ణ, శ్రీనివాస వాల్మీ తదతరులు పాల్గొన్నారు.

రేగాకు పరామర్శ

కరకగూడెం: మాతృ వియోగం కలిగిన బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును శనివారం మండలంలోని కుర్నవెల్లి గ్రామంలో ఉన్న ఆయన స్వగృహంలో జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి వేర్వేరుగా పరామర్శించారు. రేగా తల్లి నర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అంతకు ముందు వివిధ పార్టీల నాయకులు సైతం కాంతారావును పరామర్శించారు.

నవోదయలో సీట్లు

బూర్గంపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నూతనంగా ప్రారంభించిన నవోదయ కేంద్రీయ విద్యాలయంలో సారపాక బ్రిలియంట్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు సీట్లు సాధించారు. నవోదయలో సీట్లు సాధించిన విద్యార్థులను శనివారం పాఠశాల కరస్పాండెంట్ బి.నాగేశ్వరరావు, హెడ్‌మాస్టర్ స్వర్ణకుమారి అభినందించారు. ఈ ఏడాది కూడా విద్యార్థులకు నవోదయ ప్రవేశ పరీక్షలలో కోచింగ్ అందిస్తున్నట్లు వారు తెలిపారు.



గొల్లగూడెంలో గోరింటాకు కోస్తున్న యువతులు



రోలులో గోరింటాకు రుబ్బుతూ..

ఆషాఢంలో గోరింటాకు శోభ!

- పల్లెల్లో వెల్లివిరుస్తున్న సంప్రదాయం
- అందం.. ఆరోగ్యం పదిలం
- ఆడపడుచుల సందడితో పండుగ వాతావరణం

సండే స్పెషల్

కరకగూడెం: ఆషాడ మాసం రాగానే పల్లెల్లో ఓ ప్రత్యేకమైన శోభ వెల్లివిరుస్తుంది. ఆడపిల్లలు, మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ఆషాడ మాసం సంప్రదాయంగా పండుగ వాతావరణాన్ని తలపిస్తుంది. కేవలం అందం కోసమే కాకుండా దీని వెనుక ఎన్నో ఆరోగ్య రహస్యాలు, సాంస్కృతిక ఆచారాలు దాగి ఉన్నాయని పెద్దలు చెబుతున్నారు.

ఆడపడుచులు, నవవధువులుకు ప్రత్యేకం..

ఆషాడ మాసంలో పల్లెల్లో ఆడపడుచులు గోరింటాకు చెట్ల వద్దకు వెళ్లి ఆకులను సేకరిస్తారు. వాటిని రోట్లో వేసి మెత్తగా రుబ్బి చిటికెడు చింత పండు రసం లేదా నిమ్మరసం కలిపి ముద్దగా తయారుచేస్తారు. ఆ తర్వాత తమ చేతులకు, కాళ్లకు అందమైన డిజైన్లతో ఆ ముద్దను అద్దుకుంటారు. రాత్రంతా అలాగే ఉంచుకొని ఉదయాన్నే కడిగేస్తే చేతులు ఎర్రగా అందంగా మెరిసిపోతాయి. గోరింటాకు పెట్టుకున్న తర్వాత చేతులు ఎంత ఎర్రగా పండితే అంత అదృష్టం అని, భర్త ప్రేమ అంత ఎక్కువగా ఉంటుందని నమ్ముతారు. ఈ నమ్మకాలతో పాటు గోరింటాకు పెట్టుకునే సమయంలో ఆడపడుచులు ఒకచోట చేరి కబుర్లు చెప్పుకోవడం, పాటలు పాడుకోవడం, నవ్వులతో సందడి చేయడం పల్లె వాతావరణాన్ని మరింత ఆహ్లాదకరంగా మారుస్తుంది. కొత్తగా పెళ్లైన వధువులు తమ పుట్టింటికి వచ్చి గోరింటాకు పెట్టుకోవడం, స్నేహితురాళ్లతో కలిసి ఆనందంగా గడపడం ఈ మాసం యొక్క మరో ప్రత్యేకత.

ఆరోగ్య రహస్యాలు ఎన్నో..

గోరింటాకు పెట్టుకోవడం కేవలం సంప్రదాయం లేదా అందం కోసం మాత్రమే కాదు దీని వెనుక అనేక ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. ఆషాడ మాసంలో వర్షాలు, చల్లని వాతావరణం ఉన్నప్పటికీ శరీరంలో వేడి పెరిగే అవకాశం ఉంటుంది. గోరింటాకుకు సహజంగా చలువ చేసే గుణం ఉంది. గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది తద్వారా వేడి సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే గోరింటాకు చేతులకు కాళ్ళకు పెట్టుకోవడం వల్ల నరాలకు విశ్రాంతి లభిస్తుందని, ఒత్తిడి తగ్గి ప్రశాంతత చేకూరుతుందని నమ్ముతారు. ఇది ఒక రకమైన ఆక్యుప్రెషర్ లాగా పనిచేస్తుంది. దీనికి తోడు వర్షాకాలంలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల చేతులకు కాళ్లకు ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువ. గోరింటాకులో ఉండే యాంటీ ఫంగల్, యాంటీబ్యాక్టీరియల్ గుణాలు ఈ ఇన్ఫెక్షన్లను నివారించడంలో సహాయపడతాయి. అదేవిధంగా గోరింటాకు చర్మానికి మంచిది. ఇది చర్మాన్ని మృదువుగా ఉంచడంలో చిన్నపాటి గాయాలను నయం చేయడంలో సహాయపడుతుంది. గోరింటాకు గోళ్లను బలంగా ఉంచడంలో వాటికి మెరుపును ఇవ్వడంలో సహాయపడుతుంది.



ఎర్రగా పండితే సంతోషం..



ఆషాడ మాసం వచ్చిందంటే మాకు పండుగే. చిన్నప్పుడు నానమ్మ, అమ్మ గోరింటాకు రుబ్బి పెట్టేవారు. ఇప్పుడు ఫ్రెండ్స్ అందరం కలిసి డిజైన్లు వేసుకుని ఫోటోలు తీసి సోషల్ మీడియాలో షేర్ చేసుకుంటాం. ఎంత ఎర్రగా పండితే అంత సంతోషం. ఇది మాకు సరదానే కాక సంప్రదాయం.

– గోగ్గలి సుజాత, పద్మాపురం

గోరింటాకును మరువను..



వర్షాకాలంలో గోరింటాకు చేతులకు చలువ చేస్తుందని, ఎలాంటి ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుందని మా అమ్మ చెప్పింది. ఇది కేవలం అందం కోసమే కాదు ఆరోగ్యానికి కూడా మంచిది. అందుకే ప్రతి ఆషాడ మాసంలో తప్పకుండా గోరింటాకు పెట్టుకోవడం మరువను.

– మలకం సంధ్య, గొల్లగూడెం

సంప్రదాయంలో ఆరోగ్యం..



గోరింటాకులో ఉండే లాసోన్ అనే సహజ రసాయనం యాంటీ ఫంగల్, యాంటీబ్యాక్టీరియల్ గుణాలను కలిగి ఉంటుంది. ఇది చర్మాన్ని రక్షించడంలో, గోళ్లకు వచ్చే ఇన్ఫెక్షన్లను నివారించడంలో సహాయపడుతుంది. గోరింటాకుకు శరీర ఉష్ణోగ్రతను తగ్గించే గుణం ఉంది.

– దుర్గా భవాని, వైద్యాధికారి, పినపాక

'నాబార్డు' ఆవిర్భావ దినోత్సవం



మల్లాయిగూడెంలో మొక్క నాటుతున్న నాబార్డు ఉద్యోగులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పండువారిగూడెం, మల్లాయిగూడెం గ్రామాల్లో జీవా, మాక్స్ కమిటీల ఆధ్వర్యంలో నాబార్డు 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, నాబార్డు సిబ్బంది కలిసి గ్రామాల్లో ప్లకార్డులను చేతపట్టుకుని 'ఏక పంట వద్దు.. బహుళ పంటలు ముద్దు'అంటూ నినాదాలు చేస్తూ, ర్యాలీలు తీసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో కమిటీ అధ్యక్షుడు దారా ప్రసాద్, కొర్రి మల్లయ్య, పింగళి వెంకటేశ్వరరావు,పేరుబోయిన శ్రీనివాసరావు, జమ్మి జయరాజు పాల్గొన్నారు.

'రైతులను మభ్యపెడుతున్న తుమ్మల'

అశ్వాపురం: అశ్వాపురం మండలానికి సీతారామ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు అందించే మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయకుండా రైతులను మభ్యపెడుతూ సీతారామ ప్రాజెక్ట్ నీటిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం జిల్లాకు తరలిస్తున్నారని మొండికుంట మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి విమర్శించారు. మొండికుంటలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయంటూ అధికారులను చివాట్లు పెట్టి, రైతులను మభ్యపెట్టారన్నారు. ఆపై బహిరంగంగా బీజీ కొత్తూరు పంప్‌హౌస్ నుంచి ఖమ్మం జిల్లాకు నీరు తరలిస్తున్నారని విమర్శించారు.

పేపర్ బ్యాగులే వాడాలి



పేపర్ బ్యాగులను ప్రదర్శిస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు

అశ్వారావుపేటరూరల్: రోజు రోజుకూ పెరిగిపోతున్న ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేందుకు పేపర్ బ్యాగులే వాడాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.స్పందన కోరారు. శనివారం మండలంలోని పెదవాగు ప్రాజెక్టు గ్రామంలోని ప్రభుత్వ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల(దమ్మపేట)లో ప్రపంచ పేపర్ బ్యాగ్ డే సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులతో పేపర్లతో పలు రకాల బ్యాగులను తయారీ చేయించి ప్రదర్శించారు. వీటినే వినియోగించాలని సూచించారు. సీటీఓ ఎం.అరుణ, సిబ్బంది ఎస్.భూవన, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇళ్ల పరిసరాల్లో మురుగు నిల్వ



అశ్వారావుపేటరూరల్: ఇళ్ల పక్కనే మురుగునీటి నిల్వ



మణుగూరుటౌన్: హాస్టల్ సమీపంలో చెత్తతో పేరుకుపోయిన కాల్వ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలోని మొద్దులమడ గ్రామంలో ఇళ్ల వద్దే మురుగునీరు నిలిచి అధ్వానంగా ఉంది. ఇటివలే కురిసిన వర్షాలకు నీరు నిలిచి మురుగు పేరుకుపోగా.. దుర్వాసన వెదజల్లుతోంది. మురుగునీటిలో దోమలు వ్యాపించడంతో చుట్టు పక్కల వారంతా అవస్థలు పడుతున్నారు. జ్వరాల బారిన పడాల్సి వస్తోందేమేనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్‌ను 'సాక్షి'వివరణ కోరగా.. ఇళ్ల వద్ద ఉన్న మురుగును గుర్తించామని, దోమల నివారణ మందు చల్లించామని తెలిపారు. త్వరలోనే గుంతను పూడ్చే విధంగా చర్యలు తీసుకుంటానని అన్నారు.

మణుగూరుటౌన్: మండలంలోని సమితిసింగారం పంచాయతీలోని పాత పోలీస్‌లైన్‌లో కాల్వ శుభ్రం చేయాలని ఆ ప్రాంత ప్రజలు వేడుకుంటున్నారు. చెంతనే ఎస్టీ బాలుర హాస్టల్ ఉండటంతో విద్యార్థులకు జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ఇప్పటికే ఆ వీధిలో ఒకే కుటుంబంలో ఇరువురు డెంగీ బారిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఈ కాల్వ గుండా వచ్చిన వరద నీటితో ఆ ప్రాంతం ముంపునకు గురవగా, ఈ ఏడాది వాన కాలం ప్రారంభమై వర్షాలు కురుస్తున్నా ఇంతవరకు కాల్వ పూడికతీత తీయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు'



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

మణుగూరురూరల్: పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న ఉద్దేశంతో ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అనర్హులైన పైరవీకారుల దరి చేరుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మున్సిపాలిటీలోని స్నేహాగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గంలో ఇందరమ్మ ఇళ్లను అర్హులైన పేదలకు ఇవ్వకుండా.. పైరవీలు చేసే కార్యకర్తలకు కేటాయిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం వాటా ఉన్నా.. లబ్ధిదారుల ఎంపికలో అన్యాయం జరగుతోందని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్.రామచందర్‌రావుపై రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంపన సీతారామరాజు, మండల అధ్యక్షుడు పట్వా బిక్షపతి, నాయకులు ఈసాల వెంకటేశ్వర్లు, శివప్రసాద్, సాయి, కామసాని వీరమధుసూధన్, కుంజా రామకృష్ణ, మీసాల దుర్గారావు, బోగే చందర్‌రావు, ముత్యాల వెంకటేశ్వర్లు, లింగంపల్లి రమేష్, కంపెర్ల సాంబశివరావు, పల్లపు కిషోర్‌బాబు, ఏనిక రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

భద్రాచలంటౌన్: భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆధార్ కార్డులో అవసరమైన వివరాల సవరణలు చేసుకునేందుకు ఈనెల 14వ తేది నుంచి 16 వరకు ప్రత్యేకంగా మెగా ఆధార్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ దామోదర్ రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల, బూర్గంపాడు మండలాల ప్రజలు ఆధార్ కార్డులో తప్పులున్నవారు, కొత్త సమాచారం జత చేయాలనుకునేవారు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ఆధార్ క్యాంపులో పేరు మార్పు, సవరణ, పుట్టిన తేదీ సవరణ, లింగం మార్పు, చిరునామా సవరణ, మొబైల్ నెంబర్ అప్డేట్, ఫోటో అప్డేట్, బయోమెట్రిక్ అప్డేట్, తల్లిదండ్రుల పేర్లను జోడించడం వంటి సేవలతో కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా 5 నుంచి 15 సంవత్సరాల వయసు గల పిల్లలకు బయోమెట్రిక్ వివరాలు తప్పనిసరిగా నవీకరించాల్సి ఉంటుందని, అలాగే 0–5 సంవత్సరాల వయసు గల పిల్లల ఆధార్లు తల్లిదండ్రుల పేర్లను జత చేసే అవకాశం కూడా ఈ క్యాంపులో కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

గుంపెనలో వైద్యశిబిరం

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని గుంపెన పంచాయతీ హెచ్ కాలనీలో శనివారం ఎర్రగుంట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ ప్రియాంక రోగులను పరీక్షించి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ ప్రియాంక గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఎస్తేర్‌రాణి, రామదాసు, రాణి పాల్గొన్నారు.

బాపూజీ నగర్‌లో..

మణుగూరుటౌన్: మండలంలోని ఉడతానిగుంపు బాపూజీనగర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై నీటి నిల్వాలు లేకుండా చేసుకోవాలని, డ్రెయినేజీలో యాంటి లార్వా చేశారు. రాంప్రసాద్, విజయ, స్రవంతి పాల్గొన్నారు.

సెలవు రోజూ పాఠశాల సేవలో..



తాగునీటి సరఫరాను పునరుద్ధరించిన పోశయ్య..

అశ్వాపురం: సెలవు రోజు కూడా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూ ఐదు పదుల వయస్సులోను అలుపెరుగని ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు ఆ ఉపాధ్యాయుడు. మండల పరిధిలోని కుర్నాపల్లి కొత్తూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న పోశయ్య శనివారం పాఠశాలలో స్థానిక యువతతో కలిసి ఇంకుడుగుంతల నిర్మాణం, పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం చేపట్టి మొక్కలు నాటారు. విద్యార్థుల కోసం తాగునీటి సౌకర్యం పునరుద్ధరించారు. కార్యక్రమంలో చైర్మన్ పాయం శృతి, నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండల కేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పండితుల వేదమంత్రోత్సరణల నడుమ స్వామివారి కల్యాణ క్రతువు జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ కల్యాణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

మణుగూరుటౌన్: మండలంలోని అశోక్‌నగర్‌లోని ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పొడుతూరి కల్యాణ్ బాబు అన్నారు. శనివారం హాస్టల్‌ను సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రహరీ గోడ పడిపోవడంతో పాటు కిచెన్‌లో ఫ్లోర్ పగిలిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో వాటిని పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉసికెల కొండయ్య, బొమ్మల వెంకటేశ్వర్లు, పొడుతూరి రవి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ములకలపల్లి: రాయల చంద్రశేఖర్ వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు కల్లూరి కిషోర్ పిలుపునిచ్చారు. మండలపరిధిలోని ముత్యాలంపాడు గ్రామంలో శనివారం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లెందు మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో ఈనెల 16న జరుపతలపెట్టిన చంద్రశేఖర్ స్థూపావిష్కరణ, సభకు భారీగా తరలి రావాలని అన్నారు. పార్టీ ముత్యాలంపాడు గ్రామకమిటీ కార్యదర్శి ఈసం అశోక్, ఈసం శివ, కుంజా సాయి, ఈసం ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లన్నీ అధ్వానం

- అడుగడుగునా గుంతలు
- అంతా బురదమయం.. దుర్వాసన
- పట్టింపులేని అధికారులు



బురదమయంగా మారిన తండా రోడ్డు

గుండాల: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో అంతర్గత రోడ్లన్నీ అధ్వానంగా తయారవుతున్నాయి. ఎక్కడ చూసినా చెత్త, చెదారంతో పాటు, మురికి నీరు చేరి బురదమయంగా ఉన్నాయి. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు పలు రోగాల బారిన పడుతున్నారు.

రోడ్డుపైనే వాననీరు..

మండల కేంద్రంలో సంత రోడ్డు పూర్తిగా మట్టి కావడంతో చిన్న వర్షానికే బురద ఏర్పడుతోంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా విద్యాలయం, వారంతపు సంత, పశువైద్యశాల ఆ రోడ్డులోనే ఉన్నాయి. దీంతో నిత్యం నడిచే విద్యార్థులు, ప్రజలకు బురదతో ఇబ్బందులు తప్పడం లేదు. అంతేకాకుండా మండల కేంద్రంలో ముఖ్యంగా డ్రెయినేజీ నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో వాన నీరు రోడ్డుపై నిలువ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది.

నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై నీళ్లు నిలువ ఉంటున్నాయి. ఇక స్థానికులు ఇంకుడు గుంతలు తీసుకోకుండా వాడిన నీరు రోడ్డుపైనే వదిలేస్తున్నారు. దీంతో గ్రామ పంచాయతీ సమీపంలో చేరుతున్నాయి. అధికారులు సైతం చూసిచూడనట్లు వదిలేస్తున్నారు. గుండాల తండాలో అంతర్గత రహదారిపై నీళ్లు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. మండల కేంద్రంలోనే ఇలా ఉంటే ఇక చుట్టు పక్క గ్రామాల్లో రోడ్లు ఎంత అధ్వానంగా ఉన్నాయో చెప్పనక్కర లేదు.



సంత రోడ్డు..



గుండాల తండాకు వెళ్లే రోడ్డు..

పారిశుద్ధ్య చర్యల్లో విఫలం

సంబంధిత అధికారులు పారిశుద్ధ పనులు చేపట్టడంలో విఫలమవుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్లీచింగ్, ఫాగింగ్ చేయడం లేదు. రోడ్లకు ఇరువైపుల చెత్త, పిచ్చిమొక్కలు పెరిగిపోయి విషపురుగులు తిరుగుతున్నా పట్టింపు లేదు. రాత్రిపూట వీధిలైట్లు లేకపోవడంతో తిరగలేక పోతున్నామని స్థానికులు వాపోతున్నారు. చేతిపంపులు, మంచినీటి బావుల వద్ద మురికినీరు చేరి దుర్వాసనతో వస్తోంది. వర్షాకాలం ప్రారంభం నుంచే పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.